క్లుప్తంగా

అన్నదానం



చిత్తూరు రూరల్: చిత్తూరు గిరింపేటలోని శ్రీదుర్గాంబ దేవస్థానంలో ఆదివారం వైకుంఠ ద్వాదశి పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అన్నదానం చేశారు. ఆలయ మాజీ చైర్మన్ వీకే విశ్వనాథం, ఆలయ అర్చకులు మునిశేఖర్ పాల్గొన్నారు.

27న డైరీ ఆవిష్కరణ

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర డైరీని ఈనెల 27న ఆవిష్కరించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమౌళిరెడ్డి, చంద్రమౌళిపిళ్లై ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఉద్యోగులు పెద్దసంఖ్యలో విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం రాములు గుడివీధిలోని శ్రీజైన్ సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్వీ అరవింద్ ఆస్పత్రి వైద్యులు సేవలు అందించారు. మొత్తం 83 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 28 మందిని ఉచిత ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. సభ్యులు సుభాష్‌జైన్, ప్రేమ్ చంద్, విశాల్, ప్రవీణ్, సాగర్, లలిత్ పాల్గొన్నారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం రేపు

చిత్తూరు కార్పొరేషన్: ఈనెల 26న సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం వాడవాడలా పార్టీ శ్రేణులు వేడుకలు నిర్వహించాలని పేర్కొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న విజయానందరెడ్డి

గుడిపాల: ఆటో ప్రమాదంలో గాయపడిన నారగల్లు పంచాయతీ కొత్తకోట గ్రామానికి చెందిన మహిళలను ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పరామర్శించారు. ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని సర్పంచ్ మోహన్ ద్వారా ఆర్థిక సాయం అందించారు. ఏవైనా సమస్యలున్నట్లయితే ఉచితంగా ప్రముఖ ఆస్పత్రుల్లో చికిత్స చేయిస్తానని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసుదన్‌రాయల్, గోళ్ల హరిప్రసాద్, నవీన్, రమేష్, చిట్టి, సుబ్రమణ్యాయాదవ్, విద్య పాల్గొన్నారు.

వైభవంగా దత్త జయంతి



భిక్షాటన కార్యక్రమంలో భక్తులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం కట్టమంచిలోని శ్రీషిరిడి విశ్వసాయిబాబా ఆలయంలో ఆదివారం దత్త జయంతి మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం బాబాకు అభిషేక పూజలు చేపట్టి, పలు హారతులు ఇచ్చారు. అనంతరం భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టారు. ట్రస్టు చైర్మన్ సీకే లావణ్య, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్: ఎస్టీయూ చిత్తూరు అర్బన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో చిత్తూరు అర్బన్ నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు అర్బన్ అధ్యక్షుడిగా సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా హరీష్, ఆర్థిక కార్యదర్శిగా కుమార్, గౌరవ అధ్యక్షుడిగా ప్రసూన, జిల్లా కౌన్సిలర్లుగా వనిత, విజయలక్ష్మి, బిక్కా మురళిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మోహన్, జిల్లా ఆర్థిక కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమమూర్తికి ఆహ్వానం.. క్రీస్తు పుట్టుక ఆనందం

- నేడు క్రిస్మస్
- ముస్తాబైన మందిరాలు, క్రైస్తవుల ఇళ్లు

భక్తి గీతాలు ఆలపిస్తూ.. ఆ బాల ఏసు జననానికి స్వాగతాంజలి పలుకుతూ క్రిస్మస్ సంబరాలు చిత్తూరులో హోరెత్తుతున్నాయి. కొవ్వొత్తుల వెలుగుల్లో అందమైన కేక్‌లు ఏర్పాటు చేస్తూ.. నృత్యాలు చేస్తూ జరుపుకుంటున్న క్రిస్మస్ సంబరాలతో నగరం హోరెత్తుతోంది. పేదలను అక్కున చేర్చుకోవడానికి కరుణామయుడు ఏసుక్రీస్తు చూపిన దయ, మానవత్వం, ప్రేమ, అనురాగం, క్షమాగుణాలతో క్రైస్తవులు ముందుకుసాగుతున్నారు. ఆనందోత్సాహాల నడుమ క్రైస్తవులు క్రిస్మస్ సంబరాలను ప్రత్యేక ప్రార్థనలతో ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రారంభించారు.

చిత్తూరు రూరల్: శాంతి, త్యాగం, కరుణ, దయ, ప్రేమ, నిరీక్షణ సందేశంతో లోకానికి క్రీస్తు కొత్త మార్గాన్ని చూపారు. లోక రక్షకుడిగా కీర్తిస్తున్న ఏసు జననం లోకానికి పర్వదినం. శాంతి, త్యాగానికి ప్రతీకగా నిలుస్తున్న క్రిస్మస్ పండగకు చిత్తూరు నగర, మండల వ్యాప్తంగా ఉన్న చర్చిలు ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్నాయి. క్రైస్తవులు ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. క్రైస్తవుల లోగిళ్లు, ప్రార్థనా మందిరాలు తారలతో తళతళలాడుతున్నాయి. వాటిపై మైకుల్లో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో క్రీస్తు నామంతో ఉపదేశాలు వినిపిస్తున్నాయి. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

నెలంతా వేడుకలు

చిత్తూరు నగరంలోని చర్చిల్లో ఏటా క్రిస్మస్ వేడుకలు ప్రత్యేకంగా జరుపుతారు. కొన్నిచోట్ల యూత్ క్రిస్మస్‌లు ఏర్పాటు చేస్తారు. ఈ నెలంతా క్రిస్మస్ వేడుకల్లో భాగంగా నాటికలు, సెలబ్రిటీల సాక్ష్యాలు, క్యాండిల్ సర్వీస్ వంటి కార్యక్రమాలు, క్రీస్తు జననాన్ని వివరిస్తూ పశువుల పాకలను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతారు. అలాగే ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద క్రిస్మస్ స్టార్లు, క్రిస్మస్ ట్రీ, క్రిస్మస్ తాత, క్రిస్మస్ గంటలు, కొవ్వొత్తుల వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాట్లు చేస్తున్నారు.

కొవ్వొత్తుల ప్రత్యేకత..

అంధకారంలో ఉన్న ప్రపంచానికి ఏసుక్రీస్తు వెలుగులు ఇవ్వడానికి జన్మించాడనడానికి సంకేతంగా కొవ్వొత్తులు వెలిగిస్తారు. చిమ్మ చీకట్లో చర్చిల్లో కొవ్వొత్తులను వెలిగించి బైబిల్ పఠనం చేసి, ప్రార్థనా గీతాలను ఆలపిస్తూ క్రైస్తవులు క్యాండిల్స్ నైట్‌ను నిర్వహిస్తారు. ఆదివారం రాత్రి అధిక సంఖ్యలో చర్చిల వద్ద క్యాండిల్స్ నైట్‌ను ఏర్పాటు చేశారు. 25న క్రీస్తు పుట్టుకను స్వాగతించనున్నారు.



విద్యుత్ దీపాలంకరణలో టౌన్ చర్చి

క్రీస్తు పుట్టుకకు చిహ్నం స్టార్

క్రిస్మస్ నెల ప్రారంభం నుంచే క్రైస్తవులు ఇంటిపై నక్షత్రాలను అలంకరిస్తారు. జ్ఞానులు, గొల్లలకు దారి చూపిన దివ్య నక్షత్రాన్ని క్రీస్తు పుట్టుకకు ప్రత్యేక చిహ్నంగా భావిస్తారు. అందుకే క్రీస్తు రాకను కాంక్షిస్తూ.. ప్రత్యేక ప్రార్థన మందిరాలు, ఇళ్లపై స్టార్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

క్రిస్మస్ ట్రీ..

ప్రకృతిని కూడా ఆరాధించేలా క్రిస్మస్ పండగ రూపుదిద్దుకుందన్నది క్రైస్తవుల విశ్వాసం. ప్రధానంగా క్రిస్మస్ ట్రీగా వ్యవహరించే చెట్లను అందంగా అలంకరిస్తారు. పూర్వం ఓక్ చెట్టును అలంకరించేవారు. క్రిస్మస్ చెట్టును ప్యారడైజ్ ట్రీగా కూడా పిలుస్తారు. నిత్యం పచ్చగా ఉంటూ ప్రజలను సుఖంగా ఉంచుతుందని క్రైస్తవుల నమ్మకం. ఈ చెట్టుకు ఎర్రని ఆపిల్ పండ్లు, విద్యుత్ దీపాలు, నక్షత్రాలతో అలంకరించే ఆనవాయితీ. నేటికీ క్రిస్మస్ రోజుల్లో ఈ ఆనవాయితీ కొనసాగుతోంది.

చాకెట్లు ఇచ్చే క్రిస్మస్ తాత..

క్రిస్మస్ తాత వస్తాడు..బొమ్మలు, చాక్లెట్లు ఇస్తాడని చిన్నారులు ఆశగా ఎదురు చూసే సమయమిది. క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులతో క్రిస్మస్ తాత సందడి చేస్తాడు. క్రిస్మస్ వేడుక జరుగుతుండగా చిన్నారులు నిద్రపోగా...వారి పక్కనే బహుమతులు పెట్టి క్రిస్మస్ తాతలు వెళుతుంటారు. క్రిస్మస్ తాత ప్రత్యేక వేషధారణతో, తెల్లటి గడ్డంతో అందరినీ ఆకట్టుకుంటాడు.

కష్టాలు తొలగాలని..

సంపదలు శబ్దాలు చేసుకుంటూ ఇంట్లోకి రావాలని కాంక్షిస్తూ ఇంటి గుమ్మానికి గంటలు ఏర్పాటు చేస్తారు. మందిరాల్లో గంట ప్రాధాన్యం అధికం. ఇంట్లోకి వచ్చే వారికి ఈ గంటలు తగిలి శబ్దాలు వచ్చేలా వాటిని ఏర్పాటు చేస్తారు.



జీటీ మెమోరియల్ చర్చి



టౌన్ చర్చిలో ఏర్పాటు చేసిన పశువుల పాక

పల్లెల్లో క్రిస్మస్ శోభ

గుడిపాల: పల్లెలు క్రిస్మస్ శోభను సంతరించుకున్నాయి. సోమవారం నాటి క్రిస్మస్ పండుగకు ఒక్క రోజు ముందే రాసనపల్లె, పాపిశెట్టిపల్లె, బసవాపల్లె, 189కొత్తపల్లె, సియోన్‌మల్లె, అరుల్‌పురం, పాపసముద్రం, నరహరిపేట, చీలాపల్లె తదితర గ్రామాల్లోని చర్చిలను ఆయా సంఘపెద్దలు, యువకుల ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలు, స్టార్‌లతో అందంగా అలంకరించారు. క్రీస్తు జననానికి నిదర్శనమైన నక్షత్రాన్ని క్రైస్తవులు ఇళ్లపై కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన వెంటనే కొన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు మొదలయ్యాయి.

క్రిస్మస్ వేడుకలకు సిద్ధం

బంగారుపాళెం: మండలంలో క్రిస్మస్ పర్వదినాన్ని సోమవారం ఘనంగా జరుపుకునేందుకు క్రిస్టియన్లు సిద్ధం అయ్యారు. చర్చిలను సుందరంగా అలంకరించారు. మండలంలోని నలగాంపల్లె, తిమ్మోజుపల్లె, బంగారుపాళెం, మాధవనగర్ తదితర గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి చర్చిలో క్రిస్మస్ సందడి మొదలైంది.

పూతలపట్టులో..

పూతలపట్టు: మండలంలోని అనంతాపురం, సామనత్తం, పూతలపట్టు, పి.కొత్తకోట, గొడుగుచింతల గ్రామాల్లో చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. ఏసు శిలువలు, క్రిస్మస్ ట్రీ ఇతర లైటింగ్ సెట్టింగులతో అలంకరించారు. చర్చిల వద్ద క్రీస్తు జన్మవృత్తాంతం తెలిపే పశువుల పాకను ఏర్పాటు చేశారు.







విద్యుద్దీప కాంతుల్లో అనంతాపురం చర్చి, గుడిపాల: పాపసముద్రం చర్చిలో అలంకరణలు, గుడిపాల: విద్యుద్దీపాలంకరణలో రాసనపల్లె చర్చి

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- కమిషనర్ అరుణ
- 23వ వార్డు పారిశుద్ధ్య, పర్యావరణ కార్యదర్శి సస్పెన్షన్



కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, హాజరు నమోదు, రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా లేకపోయినా ఉద్యోగులపై కఠిన చర్యలు ఉంటాయని, సస్పెన్షన్ వేటు తప్పదని నగర కమిషనర్ జె.అరుణ హెచ్చరించారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరు నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నగరపాలక సంస్థ పరిధిలోని 23వ వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శి షాహీ అఫ్రిన్ షేక్‌ను సస్పెండ్ చేస్తూ నగర కమిషనర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్ శనివారం మధ్యాహ్నం 23వ వార్డు సచివాలయంలో పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నలుగురు కార్మికులకు సంబంధించి హాజరు తప్పుగా నమోదు చేసినట్లు గుర్తించారు. పారిశుద్ధ్య కార్మికులు విధులకు రాకున్నా హాజరైనట్లు నమోదు చేసి జీతాలకు బిల్లు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థకు ఆర్థికపరమైన నష్టం కలిగేందుకు కారణమైన వార్డు పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శిని సస్పెండ్ చేయడంతో పాటు, సంబంధిత ఇన్‌స్పెక్టర్, ఎంహెచ్‌ఓలు సత్వర వివరణ ఇవ్వాలని ఆదేశించారు. నగరపాలక సంస్థకు ఆర్థిక నష్టం కలిగేలా వ్యవహరిస్తే సంబంధిత ఉద్యోగులపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా కమిషనర్ హెచ్చరించారు. ప్రధానంగా క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య కార్మికుల హాజరు నమోదు పారదర్శకంగా జరగాలన్నారు. హాజరు నమోదులో అవకతవకలు జరిగితే సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆస్థాన మండపంలో ఆదివారం దేవదాయ ధర్మదాయశాఖ ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. తిరుపతికి చెందిన ప్రజాపతి చారిటబుల్ ట్రస్ట్ వారు 40 మంది కళాకారులతో భరతనాట్యం, కూచిపూడి, నృత్యప్రదర్శనలు ఇచ్చారు. కళాకారులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.



భరతనాట్యం చేస్తున్న కళాకారులు

వినాయకుడి సేవలో న్యాయమూర్తులు





జస్టిస్ నాగరత్న కుటుంబ సభ్యులకు, జస్టిస్ భట్టికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ.భట్టి, జస్టిస్ బీవీ.నాగరత్న, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి హేమలేఖ తన కుటుంబ సభ్యులతో కలసి వేర్వేరుగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. అలాగే నటుడు రాజేంద్రప్రసాద్ కూడా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ న్యాయమూర్తి రమేష్, చిత్తూరు ఏఎస్పీ సుధాకర్, ఆర్డీఓ చిన్నయ్య, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, ఐరాల తహసీల్దార్ సుశీల, సీఐ రవిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కర్ణాటక జస్టిస్‌కు చిత్రపటం అందిస్తున్న ఏఈఓ

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు బజారువీధిలో ఆదివారం స్వర్ణకార సంఘం సభ్యులకు ఎమ్మెల్యే ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యుల అభ్యర్థన మేరకు అర్హులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరయ్యేలా చేశామన్నారు. రద్దు అయినా ఇళ్ల పట్టాలను పునరుద్ధించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలతో పేదల ఆర్థికంగా కూడా సాయపడుతోందని తెలిపారు. అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీమోహన్, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి సేవలో ప్రత్యేక పూజలు

చిత్తూరు నగరం గిరింపేట శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో డీకే శ్రీనివాసులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలోనే మైనారిటీల అభ్యున్నతి



మాట్లాడుతున్న కోఆప్షన్ సభ్యుడు అను

చిత్తూరు కార్పొరేషన్: సీఎం జగనన్న హయాంలోనే మైనారిటీల అభ్యున్నతి సాధ్యమైందని, వైఎస్సార్‌సీపీకే మైనారిటీలు మద్దతు ఇస్తున్నట్లు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు అను తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరులోని ఓకల్యాణ మండపంలో మైనారిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా నగరంలో 6 డివిజన్లు, 2 కోఆప్షన్ సభ్యుల స్థానాలు ముస్లింలకు ఇచ్చి ప్రాధాన్యత కల్పించారని గుర్తు చేశారు. నవరత్నాలతో పేదలకు మేలు జరుగుతోందని, విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. చిత్తూరు నియోజవర్గ అభివృద్ధికి సీఎం జగనన్న ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. నగరంలో విజయ డెయిరీని అమూల్ సంస్థకు అప్పగించి పునఃప్రారంభించారన్నారు. గుడిపాలలో సీఎంసీ ఆస్పత్రిని విస్తరించేందుకు నాంది పలికారని తెలిపారు. తమ సంక్షేమానికి విలువనిచ్చే జగనన్నకు మైనారిటీలు మద్దతునిస్తారని వివరించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అక్రమ్, కార్పొరేటర్ సయ్యద్, మైనారిటీ నాయకులు ప్రేమ్, చాన్‌బాషా, షరీఫ్, దస్తగిరి, అప్సర్, ఇమ్రాన్, అఫ్జల్, మస్తాన్, అల్తాఫ్, నవాజ్, షకీల్, సర్ఫూ, రషీద్, అస్లాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో కదిలిన కారుణ్యం

- ఆరుగురికి నియామకాలు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థలో కారుణ్య నియామకాల దస్త్రం కదిలింది. గతనెల 30వ తేదీన 'సాక్షి' పత్రికలో 'కదలని కారుణ్య దస్త్రం' శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆరుగురికి కారుణ్య కింద ఉద్యోగ నియామక పత్రాలను మేయర్ ఎస్.అముద, కమిషనర్ జె అరుణ అభ్యర్థులకు అందించారు. సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతి చెందిన ఆరుగురు ఉద్యోగులకు సంబంధించి.. వారి కుటుంబ సభ్యుల విద్యార్హతలు, అందుబాటులో ఉన్న పోస్టుల మేరకు నియామకాలు చేపట్టారు. జి.జయంతి (పీడబ్ల్యూ మేస్త్రి), బి.హేమావతి (పీహెచ్ వర్కర్), వి.నిరంజన్ కుమార్ (పీహెచ్ మేస్త్రి), బీఆర్.నీలవేణి (గ్యాంగ్ మజ్దూర్), ఎం.హరిప్రియా (క్లీనర్ కం వాచ్మెన్), ఎం.హేమంత్ కుమార్‌ను (అటెండర్) పోస్టుల్లో నియమిస్తూ నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ.. విధుల పట్ల అవగాహన పెంచుకోవాలని, బాధ్యతగా విధులు నిర్వహించి నగరపాలక సంస్థకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

27న సామాజిక తనిఖీ బహిరంగ సభ

తవణంపల్లె: ఉపాధిహామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ ఈ నెల 27వ తేదీన బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ఏపీఓ లలిత ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో 2022వ సంవత్సరం ఏప్రిల్ నుంచి 2023 నవంబర్ వరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద జరిగిన పనులకు ఈ నెల 7వ తేదీ నుంచి 22వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. బహిరంగ సభకు మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది, రైతులు, కూలీలు పాల్గొనాలని తెలిపారు.

200 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కాలనీ ఎదురుగా ఉన్న శ్రీవారి ఆయుర్వేదిక్ స్పెషాలిటీస్ ఆయుర్వేద నిలయంలో ముంబై రాజస్థాన్ ఔషధాలయ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో దాదాపు 200 మందికి పైగా పాల్గొన్నారు. వీరికి తిరుపతి ఎస్వీ ఆయుర్వేదిక్ కళాశాల చాణక్య విభాగాధిపతి డాక్టర్ పి జగదీష్ కుమార్ రెడ్డి, తిరుపతి నగరానికి చెందిన ఆయుర్వేద చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె.జమున పలు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. శ్రీవారి ఆయుర్వేదిక్ స్పెషాలిటీస్ నిర్వాహకులు ధనంజయరెడ్డి ముంబై రాజస్థాన్ ఔషధాలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



విరాళం చెక్కును అందిస్తున్న దాత

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ. లక్ష విరాళాన్ని హైదరాబాద్ అమీర్‌పేటకు చెందిన కరుణాకరన్ ఆలయ అధికారులకు అందించారు. ఆదివారం దాత కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామివారి గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం చెక్కును ఆలయ అధికారులకు అందించారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

గణిత ప్రజ్ఞాధారణలో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గణిత ప్రజ్ఞాధారణలో ప్రతిభ చాటారని గణిత అవధాన గురువు, ఏపీ మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరుణ్‌శివప్రసాద్ తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు ఎస్వీ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం కడప జిల్లా మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో గణితోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న లహరి, పునీత్‌సాయి, హేమ, రేవతిచే గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. వందసంఖ్యలను ఒక్కసారిగా విని వాటిని ధారణ చేయడం, వంద సంఖ్యలను చివర నుంచి మొదటి వరకు తెలియజేసి వాటిని 5, 25తో గుణించి లబ్ధాలను తెలియజేశారు. విద్యార్థుల ప్రతిభను కడప జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి అభినందించారు. మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నరసింహారెడ్డి విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయురాలు భారతి, మ్యాథ్స్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.